తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి    వికారాబాద్

ఆదివారం
25 అక్టోబర్ 2026

పేజీలు : 08





Follow :










# ప్రజావసరాల స్థలానికి హైడ్రా రక్షణ

## గణేష్ ఎన్‌క్లేవర్‌లో 1,800 చదరపు గజాలకు ఫెన్సింగ్

**అల్వాల్, అక్టోబరు 24 (జనంసాక్షి):** మచ్చ బొల్లారం జొన్నబండ పరిధిలోని శ్రీ గణేష్ ఎన్‌క్లేవర్‌లో ఓపెన్ స్థలాన్ని ఆక్రమణల నుంచి పరిరక్షించేందుకు హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. సర్వే నంబర్లు 33, 34లోని సుమారు 1,800 చదరపు గజాల స్థలాన్ని శనివారం పరిశీలించి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అనధికార ప్రవేశాలు, ఆక్రమణలను నిషేధిస్తూ హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు.1969లో ఆమోదించిన గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో ఈ స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. కొందరు ఆక్రమణకు యత్నిస్తున్నారని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇందుకు ఆధారంగా లేఅవుట్ అనుమతి నంబరు 17/1969, లింక్ డాక్యుమెంట్ నంబరు 980/1969, జీపీఏ డాక్యుమెంట్ నంబరు 74/1981 పత్రాలతోపాటు భువన్ మ్యాప్, లేఅవుట్ బ్రోచర్లను సమర్పించారు. ఫిర్యాదు మేరకు హైడ్రా సీఐ రాజశేఖర్, అల్వాల్ ఎస్ఐ రాఘవేందర్ బృందం స్థలాన్ని పరిశీలించింది. లేఅవుట్ రికార్డులు, స్థల హద్దులు, యాజమాన్య పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, స్థలం కేటాయింపు స్వరూపాన్ని ధ్రువీకరించిన అనంతరం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు.

# ఉప్పల్‌లో రూ.3.2 కోట్లతో సిటీ బస్ టెర్మినల్

## ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించమే లక్ష్యం

- 100 రోజుల్లో నిర్మాణం పూర్తి..శంకుస్థాపన చేసిన రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- 1,053 సిటీ బస్సుల రాకపోకలకు ప్రత్యేక వేదిక
- వేలాది మంది ప్రయాణికులకు ఊరట





**బోడుప్పల్-జనంసాక్షి :**
ఉప్పల్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో నూతన సిటీ బస్ టెర్మినల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉప్పల్ బస్ డిపో జోనల్ వర్క్‌షాప్ ఆవరణలో రూ. 3. 2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ టర్మినల్‌కు శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్. మల్లారెడ్డి,మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ కృష్ణారెడ్డి,టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు,ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్న ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలను సురక్షితంగా,సౌకర్యవంతంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.


మిగితా 2లో




## ప్రభుత్వ భూమిలో ఈత మొక్కల తొలగింపు!

- సర్వే నంబర్ 319లో వ్యవసాయం చేస్తున్నారని గౌడ సంఘం ఆరోపణ
- మొక్కలను కాపాడాలని అధికారులకు వినతి
- భూమిని సంఘానికి కేటాయించాలని విజ్ఞప్తి
- క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్


2


# మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు ఉప్పల్ ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పర్యటన
- బ్యారేజీ పరిస్థితి, నీటి ప్రవాహంపై క్షేత్రస్థాయి పరిశీలన



**ఉప్పల్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మేడిగడ్డ బ్యారేజీ ప్రస్తుత పరిస్థితిని పరిశీలించేందుకు ఉప్పల్ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు భారీగా తరలివెళ్లారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి బ్యారేజీ వద్ద క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. బ్యారేజీ పరిస్థితి, నీటి ప్రవాహం, వృథాగా వెళ్తున్న నీటిని పరిశీలించారు. ప్రజాధనంతో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను పరిరక్షించడంతోపాటు, నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరంపై ఈ పర్యటనలో ప్రాధాన్యం సంతరించుకుంది. బ్యారేజీ భద్రత, నిర్వహణ, నీటి వృథా నివారణకు సంబంధించి సమగ్ర సాంకేతిక పరిశీలన చేపట్టి, నిపుణుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రైతులకు సాగునీరు అందేలా ప్రాజెక్టుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కీలకమని ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిస్థితిపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, వివేకానందగౌడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో రూ.3.2 కోట్లతో సిటీ బస్ టెర్మినల్

ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించమే లక్ష్యంగా నూతన సిటీ బస్ టెర్మినల్ నిర్మించేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు కేటాయించి ఈ ప్రాజెక్టుకు సహకరించడం అభినందనీయమని కొనియాడారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణాన్ని వంద రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, బస్ బేలు,ప్రయాణికుల నిరీక్షణ షెల్టర్లు,మరుగుదొడ్లు తదితర సౌకర్యాలతో దీనిని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఉప్పల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయాణం మరింత సులభతరం అవుతుంది. ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ఇప్పటికే 3,000కు పైగా కొత్త బస్సులను కొనుగోలు చేశాం. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నాం. కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రతిరోజూ సుమారు 1,053 సిటీ బస్సులు ఈ టర్మినల్ మీదుగా రాకపోకలు సాగించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని టర్మినల్ ప్రాంగణంలో ప్రత్యేక బస్ పాస్ కౌంటర్‌తో పాటు సమాచార విచారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. జిల్లా బస్సులకు పాత స్టాండ్ ఉప్పల్ నల్లచెరువు బస్ టర్మినల్ నుంచి యాదగిరిగుట్ట, వరంగల్, ఉమ్మడి నల్గొండ తదితర ప్రాంతాలకు వెళ్లే జిల్లా బస్సుల సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. కొత్తగా నిర్మించే టర్మినల్‌ను నగర పరిధిలో తిరిగే సిటీ బస్సుల కోసమే వినియోగించనున్నారు. దీంతో జిల్లా సర్వీసులు, నగర సర్వీసుల మధ్య స్పష్టమైన విభజన ఏర్పడి రవాణా నిర్వహణ మరింత సులభతరం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి గ్రంథలయ సంస్థ చైర్మన్, జోనల్ వర్కుషాపు గౌరవ అధ్యక్షుడు దర్గా దయాకర్ రెడ్డి,మాజి మేయర్లు తోటకూర్ అజయ్ యాదవ్,జక్క వెంకట్ రెడ్డి,బోడుప్పల్ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి,బొమ్మక్ కళ్యాణ్,వివిధ పార్టీల సీనియర్ నాయకులు రాపోలు రాములు, కొత్త కిశోర్ గౌడ్ ,బొడిగే కృష్ణ గౌడ్ ,హరిశంకర్ రెడ్డి, పప్పుల అంజిరెడ్డి ,కాటపాక కుమార్,,కొత్త చందర్ గౌడ్,కొత్త రవి గౌడ్,రాజారాజు, సుశాంత్ గౌడ్,కాడే పోచయ్య, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,కాటపాక భరత్,అధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

## హబ్సిగూడ, ఉప్పల్ కమాన్ క్షేత్రస్థాయి పరిశీలనతో రద్దీ నివారణకు ప్రణాళికలు



**ఉప్పల్, (జనంసాక్షి):** హబ్సిగూడ, ఉప్పల్ కమాన్ ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా కార్పొరేషన్ కమిషనర్ ఉప్పల్ కమాన్ వద్ద క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, ట్రాఫిక్ సమస్యలకు గల కారణాలను సమీక్షించారు. ప్రధాన కూడళ్ల వద్ద రద్దీని తగ్గించడం, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, రహదారుల అనుసంధానాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై అధికారులు దృష్టి పెట్టారు. కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రద్దీ సమయాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేసేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. రహదారి భద్రతను మెరుగుపరచడంతో పాటు, క్షేత్రస్థాయి లో గుర్తించిన సమస్యలకు తగిన పరిష్కారాలు అమలు చేయడంపై దృష్టి సారించారు. అయితే, చేపట్టనున్న పనులు, వాటి అమలు తేదీలపై అధికారిక వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# టిప్పర్ లారీ ఢీకొని మహిళ మృతి

**శంషాబాద్,అక్టోబర్24(జనంసాక్షి) :** హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్డులో టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో జిగిరి అనిత (40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. శనివారం సాయంత్రం ఆర్జిఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్‌లోని బాంబే కాలనీకి చెందిన అనిత టిఎస్ 07 ఎఫ్జడ్ 3598 నంబర్ గల ద్విచక్ర వాహనంపై కిస్మత్‌పూర్‌లో పని కోసం వెళ్లి తిరిగి వస్తుండగా, హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్డులోని హనుమాన్ దేవాలయం సమీపంలో వెనుక నుంచి వచ్చిన టిఎస్ 07 యుఎల్ 5007 నంబర్ గల అశోక్ లేలాండ్ టిప్పర్ లారీ ఆమె వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆమె లారీ వెనుక చక్రాల కింద పడి తీవ్ర గాయాలతో చిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పెన్షన్ల పెంపు హామీ ఏమైంది?

- రేవంత్ సర్కారుపై కాళ్ల జంగయ్య ఆగ్రహం
- అర్హులందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి
- కేసీఆర్, చంద్రబాబు పాలనతో పోల్చిన వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు
- పెన్షన్ల కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరిక



**యాచారం, అక్టోబర్ 24 (జనంసాక్షి):** పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్ల మంజూరుపై ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య విమర్శించారు. వికలాంగులకు నెలకు రూ.6 వేలు, ఇతర పెన్షన్‌దారులకు రూ.4 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికీ హామీని నెరవేర్చకపోవడం సరికాదన్నారు. అర్హులైన వారందరికీ తక్షణమే కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పెన్షన్లు పెంచారని, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ల పెంపుతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారని జంగయ్య పేర్కొన్నారు. వారి విధానాలను చూసైనా సీఎం రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు. దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేసినా కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, దసరా సందర్భంగా కొత్త పెన్షన్లు ఇస్తామని ప్రకటించి కాలయాపన చేశారని ఆరోపించారు. భర్త మరణించిన వితంతువులకు, అర్హత పొందిన వృద్ధులకు, సదరం ధ్రువపత్రం పొందిన వికలాంగులకు, సంబంధిత ధ్రువీకరణ పూర్తయిన ఒంటరి మహిళలకు నిబంధనల ప్రకారం పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలోనే కాకుండా అర్హత సాధించిన వెంటనే పెన్షన్లు అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుమారు 44 లక్షల మంది పెన్షన్‌దారుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కాళ్ల జంగయ్య హెచ్చరించారు.

# బంట్వారంలో బెల్ట్ షాపుల జోరు.. అధికారుల నిఘా ఏదీ?

- గ్రామగ్రామాన అక్రమ మద్యం విక్రయాలు
- అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారనే ఆరోపణలు
- గిరిజన తండాలకూ విస్తరించిన విక్రయాలు
- బెల్ట్ షాపులపై దాడులు చేయాలని ప్రజల డిమాండ్

బంట్వారం, అక్టోబర్ 24 (జనంసాక్షి): వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా అక్రమ మద్యం విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలు, గిరిజన తండాల్లోనూ మద్యం అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నాలుగైదు వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కిరాణా దుకాణాల్లోనూ చీప్ లిక్కర్, బీర్లు విక్రయిస్తున్నారని, మద్యం బాటిళ్లపై అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బులో అధిక మొత్తాన్ని మద్యానికి ఖర్చు చేయాల్సి వస్తోందని పేద కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని దుకాణాల వద్ద బహిరంగంగా గ్లాసుల్లో మద్యం పోసి విక్రయిస్తున్నారని ఆరోపణలున్నాయి. మర్పల్లి, మోమిన్‌పేట, తాండూరు తదితర ప్రాంతాల నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణపై ఎక్సైజ్ అధికారులు సమర్థంగా నిఘా పెట్టడం లేదని, తనిఖీలు నామమాత్రంగా సాగుతున్నాయని విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై, మామూళ్ల ఆరోపణలపై విచారణ జరపాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బంట్వారం మండలంలోని గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి, అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ

**శంషాబాద్,అక్టోబర్24(జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ఏసీపీ పి. నాగభూషణం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ లు పేర్కొన్నారు. 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్‌బీ నగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం ప్రమాదకరమని వివరించారు. వాహనాల్లో సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ పి. అనిల్ కుమార్, శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో ఈత మొక్కల తొలగింపు!

- సర్వే నంబర్ 319లో వ్యవసాయం చేస్తున్నారని గౌడ సంఘం ఆరోపణ
- మొక్కలను కాపాడాలని అధికారులకు వినతి
- భూమిని సంఘానికి కేటాయించాలని విజ్ఞప్తి
- క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్



**మొయినాబాద్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అమ్డాపూర్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలో నాటిన ఈత మొక్కలను తొలగిస్తూ వ్యవసాయం చేస్తున్నారని గౌడ సంఘం సభ్యులు ఆరోపించారు. మొక్కలను పరిరక్షించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చేవెళ్ల ఎక్సైజ్ సీఐకి కూడా సమస్యను వివరించారు. గ్రామంలోని సర్వే నంబర్ 319లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా అందించిన ఈత మొక్కలను గౌడ సంఘం సభ్యులు నాటినట్లు తెలిపారు. గౌడ కులవృత్తికి ప్రోత్సాహం అందించి, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంపొందించాలనే ఉద్దేశంతో మొక్కలను నాటినట్లు పేర్కొన్నారు. గతంలో చేవెళ్ల ఎక్సైజ్ సీఐ రాకేష్‌కుమార్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. అయితే, అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి నరసింహ ప్రభుత్వ భూమిలో బోరు తవ్వించి వ్యవసాయం చేస్తూ, తాము నాటిన ఈత మొక్కలను తొలగిస్తున్నారని సంఘం సభ్యులు ఆరోపించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు గౌడ కులవృత్తి అభివృద్ధి లక్ష్యానికి విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి భూమి హద్దులు, ప్రస్తుత వినియోగం, మొక్కల తొలగింపుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే నంబర్ 319లోని ప్రభుత్వ భూమిని నిబంధనల ప్రకారం గౌడ సంఘానికి కేటాయిస్తే ఈత చెట్లను సంరక్షించడంతో పాటు కులవృత్తిని అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశారు.

# నీటి ఎద్దడిపై అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి

**మున్సిపల్ కమిషనర్ కు బీజేపీ కౌన్సిలర్ల వినతి**

**తాండూరు ఆక్టోబర్ 24(జనంసాక్షి) :** తాండూరు పట్టణంలో తీవ్రమవుతున్న నీటి సమస్య, రానున్న రోజుల్లో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని వెంటనే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ని కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, నీటిని ఏ విధంగా వాడుకోవాలి, నీటిని ఏ విధంగా రక్షించుకోవాలి అనే అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగాలి. ప్రభుత్వపరంగా, మున్సిపల్ పరంగా నీటిని రక్షించడానికి, భవిష్యత్తులో తాండూరు పట్టణ ప్రజలకు నీటిని అందించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో స్పష్టం చేయాలి. భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని నీటి వనరులను ఏ విధంగా వినియోగించుకోవాలి, నీటి సమస్యను ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశాలపై సమగ్ర చర్చ జరగాలని కోరారు. తాండూరు పట్టణంలో సమస్యలు చాలా ఉన్నాయి, ముఖ్యంగా నీటి సమస్య ప్రధానమైనది. కాబట్టి వెంటనే మున్సిపల్ సమావేశం నిర్వహించవలసిందిగా కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ ఫ్లోర్ లీడర్, 28వ వార్డ్ కౌన్సిలర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం , 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్ పాల్గొని మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు.





## ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకం

**పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి**

**తాండూరు ఆక్టోబర్ 24(జనంసాక్షి) :** పట్టణంలోని సాయిపూర్‌లో వెలసిన శ్రీ ప్రసన్న అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారి ప్రత్యేక అభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారి కృపతో తాండూరు పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పట్టణం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించాను" అని తెలిపారు. ఆలయంలో వేద పండితులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన



**షాబాద్, అక్టోబర్ 24(జనం సాక్షి);** భూసార పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు పొందవచ్చని చేవెళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు సురేష్ బాబు, షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచనపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... రైతులకు భూసార పరిరక్షణ, భూసార పరీక్షల ప్రాముఖ్యత, భూసార ఆరోగ్య కార్డుల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రీయ ఎరువుల ప్రాధాన్యత, పంట అవశేషాల నిర్వహణ సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యాకరణ, స్థిరమైన పోషక యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలను వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతుల అమలుపై అవగాహన కల్పించారు. అలాగే ఎల్ నినో నేపథ్యంలో ఈ యాసంగిలో వరికి బదులుగా పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయల పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోడ రాధ, వ్యవసాయ విస్తరణ అధికారి బాబ్యా నాయక్, ఉద్యాన విస్తరణ అధికారి బాలరాం, రైతులు బిక్షపతి, రమేష్, కృష్ణయ్య, సత్యనారాయణ, మాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అర్బన్ వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియామకం



**కూకట్ పల్లి, అక్టోబర్ 24(జనంసాక్షి):** ఈ సందర్భంగా పంతంగి హర్ష యాదవ్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డికి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తోపుకొండ మైపాల్ రెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్‌కు, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పొట్లపల్లి సాయికుమార్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, యువతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తూ బీజేవైఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హర్ష యాదవ్ పేర్కొన్నారు. యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.



## కేటీఆర్‌ను కలిసిన నందికంటి శ్రీధర్

**మల్కాజిగిరి అక్టోబర్ 23 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ జిల్లాల పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో భారాస మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్ శనివారం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకానికి ఆయన కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి నియోజకవర్గంలోని ప్రతి పట్టభద్రుడిని కలిసి పార్టీ సిద్ధాంతాలను, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తామని చెప్పారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ భారాస విజయం కోసం శక్తివంచన లేకుండా శ్రమిస్తానని స్పష్టం చేశారు. బాధ్యతాయుతంగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు దిశానిర్దేశం చేశారు.

## బీజేపీ మండల, జిల్లా కార్యవర్గంలో అబ్దుల్లాపూర్‌మెట్ నాయకులకు కీలక బాధ్యతలు

**అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడిగా కొండల్ రెడ్డి, జిల్లా రూరల్ కార్యవర్గ సభ్యుడిగా శ్రవణ్ కుమార్ చారి**



**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన ఇద్దరు నాయకులకు కీలక పదవులు లభించాయి. చిన్న రావిరాల గ్రామానికి చెందిన గోమారపు కొండల్ రెడ్డిని బీజేపీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడిగా, అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన శీలోజు శ్రవణ్ కుమార్ చారిని జిల్లా రూరల్ కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజగోపాల్ గౌడ్ నూతనంగా నియమితు లైన నాయకులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ నియామ కాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయి లో బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిం చారు. నూతన నియామకాలతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో బీజే పీ కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాలాజీనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం



**కూకట్‌పల్లి, అక్టోబర్ 24(జనంసాక్షి):** ఉమ్మడి రంగారెడ్డి-మహబూబ్‌నగర్-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని బాలాజీనగర్ డివిజన్‌లో శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాప్ రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బి. సంజీవరావు హాజరయ్యారు. డివిజన్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్, గొట్టిముక్కల జశ్వంత్ రావు (దేశాల్), మేకల మైఖేల్, తమ్మినేని ప్రవీణ్ కుమార్, విఠల్ రెడ్డి, కొండల్ రెడ్డి, ప్రకాష్ ముదిరాజ్, ఫణింద్ర కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు పాల్గొన్నారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఘనంగా భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ మూడో వార్షిక సర్వసభ్య సమావేశం

**ఐదేళ్లలో 4,100 మందికి పైగా సభ్యులతో విస్తరణ**

**ముషీరాబాద్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ (బీబీజీ) మూడో వార్షిక సర్వసభ్య సమావేశాన్ని జె. లక్ష్మణ్ కుమార్, జె.పి. సుధాకర్ పర్యవేక్షణలో శనివారం భాగలింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించింది. ఈ సమావేశానికి జంట నగరాలకు చెందిన 200 మందికి పైగా ఉద్యోగ, విశ్రాంత బ్యాంకర్లు హాజరయ్యారు. 2020లో విశ్రాంత బ్యాంకర్లచే స్థాపించబడిన ఈ సంస్థ ఐదేళ్లలో సున్నా నుంచి 4,100 మందికి పైగా సభ్యులతో విస్తరించడం విశేషమని సంస్థ వ్యవస్థాపకుడు టి.ఎస్.వి. ప్రసాద్ తెలిపారు. గత ఏడాది కాలంలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. సంస్థ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన నివేదికను కోశాధికారి వరద నాగయ్య సమర్పించారు. సంస్థ చేపట్టిన వివిధ కార్యక్రమాల వివరాలను కార్యదర్శి తులసి కృష్ణమూర్తి వెల్లడించారు.




సంస్థలో జీవితకాల సభ్యుల పరిరక్షకుల సంఖ్య 600 నుంచి 710కి పెరిగినట్లు తెలిపారు. ముగింపులో లక్ష్మణ్ కుమార్ వందన సమర్పణ చేశారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న సభ్యులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని సమావేశంలో ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కె. జీవానందం, కె. వెంకోబా రాయ్, బి. జయబాబు, గాండె విద్యాసాగర్, పి.వి. నాగరాజారావు, ఎస్. మారుతి రామ్, జె.వి. చలం, మహిళా కమిటీ సభ్యులు తులసి పద్మజ, జె.పి. అనురాధ, వి. సుబ్బలక్ష్మి, ఎస్.ఎస్. వనిశ్రీ, ఎ. అరుణ, ఎన్. రోహిణి, జి. రేణుక, ఎస్. పద్మతో పాటు పలువురు సభ్యులు హాజరయ్యారు.

## పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

**ఫిజికల్ ఓపెన్ హౌస్, మాదకద్రవ్యాలపై వ్యాసరచన పోటీలు**



**చేవెళ్ల, అక్టోబర్ 24 (జనంసాక్షి):** పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు--2026 సందర్భంగా చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఫిజికల్ ఓపెన్ హౌస్ కార్యక్రమంతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చేవెళ్లలోని సత్య సాయి గ్రామర్ హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఫిజికల్ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసుల విధులు, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీసుల పాత్రను వివరించారు. బ్రీత్ అనలైజర్లు, కెమెరాలు, ట్యాబ్లెట్లు, బాటన్లు, రిఫ్లెక్టివ్ జాకెట్లు, టింట్ మీటర్లు, షోల్డర్ లైట్లు, గాగుల్స్, మాన్‌ప్యాక్‌ల వంటి ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరికరాలను విద్యార్థులకు పరిచయం చేశారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా, చేవెళ్లలోని బి.జె.ఆర్. వొకేషనల్ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, వాటి దుష్ప్రభావాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబ, సామాజిక జీవితంపై ప్రతికూల ప్రభావాలు పడతాయని వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో చేవెళ్ల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి.సతీష్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, సత్య సాయి గ్రామర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అరుణ్, పాఠశాల విద్యార్థులు, బి.జె.ఆర్. వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## తాండూరులో 'ఆశల' రాజకీయం

**పదవుల కోసం ఎదురుచూపులు, నాయకుల్లో నైరాశ్యం**

**తాండూరు ఆక్టోబర్ 24(జనంసాక్షి) :** రాజకీయం ఎప్పుడూ ఆసక్తికరమే. ఎన్నికలు అయిపోయాయి, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు దాటింది. ఇక మొదలైంది అసలు సినిమా – పదవుల వేట.అధికారంలోకి వచ్చిన పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఆశ ఉంటుంది. మండల పార్టీ, మార్కెట్ కమిటీ, గ్రంథాలయ చైర్మన్, దేవాలయ కమిటీలు... ఇలా ఏదో ఒక పదవి వస్తుందని. ఆ ఆశలతోనే చాలా మంది నాయకులు పార్టీ మారారు, జెండాలు మోశారు, జై కొట్టారు.

**ఫలితం - కార్యకర్తల్లో నిరాశ.....**

పార్టీ కార్యాలయంలో కనిపించడం తగ్గింది. ఎక్కడైనా కార్యక్రమం ఉంటే పదవులు ఉన్న నాయకులే ముందు వరుసలో ఉంటున్నారు. పదవి లేని నాయకులు వెనుకబడిపోతున్నారు. దీంతో "పదవి ఉంటేనే ఉత్సాహం, లేకుంటే నీరసం" అనే కొత్త సంస్కృతి మొదలైందని సీనియర్ నాయకులు చెవులు కొరుక్కుంటున్నారు.ఇప్పుడు నాయకుల పరిస్థితి గాలిలో దీపంలా ఉందని అనుచరులే అంటున్నారు. అటు పాత పార్టీలోనూ ఇమడలేక, ఇటు కొత్త పార్టీలోనూ పదవి రాక నలిగిపోతున్నారు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, పెద్ద నాయకులు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారట.రాజకీయాల్లో ఇది సహజం. ఎత్తుకు ఎదగాలని పోయి, ఆశల గోతిలో పడినట్టు అయ్యిందని ప్రత్యర్థులు సెటైర్లు వేస్తున్నారు.తాండూరు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు దాదాపు 40 వరకు ఉన్నాయి. కానీ ఆశావహులు మాత్రం 200 మందికి పైనే ఉన్నారు. బీఎంఆర్ వర్గం, పట్నం మహేందర్ రెడ్డి వర్గం – ఈ రెండు వర్గాల మధ్య పదవుల లెక్క తేలడం లేదు. దీంతో నాయకులకు పదవులు అందని ద్రాక్షలా మారుతున్నాయి.రాబోయే , స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఈ పదవుల జాతర పూర్తవుతుందా? లేక ఆశలు అడియాశలవుతాయా? అనేది వేచి చూడాలి.

## అగ్ని ప్రమాదంలో దెబ్బతిన్న చర్చి నిర్మాణానికి కృషి చేస్తా

**శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**



**మోమిన్ పేట అక్టోబర్ 24( జనం సాక్షి) :** అగ్ని ప్రమాదంలో దెబ్బతిన్న చర్చిని పరిశీలించిపునర్నిర్మించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శనివారం మండల పరిధిలోని వెల్ చాల్ గ్రామంలో ప్రమాదానికి గురైన చర్చిని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడుతూ గడ్డిని నిర్మించడానికి సహాయం చేస్తాడని హామీ ఇచ్చారు. ప్రమాదంలో చర్చి దెబ్బతినడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, చర్చి పునర్నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, క్రైస్తవ సోదరులతో మాట్లాడుతూ, అగ్ని ప్రమాదం వల్ల కలిగిన నష్టాన్ని అధిగమించి చర్చిని తిరిగి నిర్మించుకునేందుకు తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. చర్చి పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలపై సంబంధిత వ్యక్తులచే మాట్లాడారు ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి తహసీల్దార్ మునీరుద్దీన్ , పిఎసిఎస్ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నె శంకర్ యాదవ్ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కోస్గి సురేందర్ స్థానిక సర్పంచ్ కావలి శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీ విట్టల్ ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు గ్రామస్తులుచర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.

## 90 ఏళ్ల వృద్ధురాలి బంగారు ఆభరణాల అపహరణ

- 24 గంటల్లోనే నిందితురాలి అరెస్టు.. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు
- సుమారు తులం బంగారు గుండ్లను లాక్కెళ్లిన నిందితురాలు
- గతంలో హత్య, దొంగతనం కేసుల్లోనూ ప్రమేయం ఉన్నట్లు పోలీసుల వెల్లడి

**చేవెళ్ల, అక్టోబర్ 24 (జనంసాక్షి):** పల్గుట్ట గ్రామంలో 90 ఏళ్ల వృద్ధురాలి బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారైన నిందితురాలిని చేవెళ్ల పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేశారు. నిందితురాలిని న్యాయస్థానంలో హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్గుట్ట గ్రామానికి చెందిన సంకూరి అనిత అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుండగా, ఆమె అత్తగారు వెంకటమ్మ (90) గ్రామంలోని పాత ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. అక్టోబర్ 23న ఉదయం 9 గంటల సమయంలో అనిత అత్తకు భోజనం పెట్టి విధులకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గ్రామానికి చెందిన చాకలి వెంకటేష్ ఫోన్ చేసి, గుర్తుతెలియని మహిళ ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలి ఆభరణాలను లాక్కొని పరారైనట్లు సమాచారం అందించాడు. వెంటనే ఇంటికి చేరుకున్న అనిత విచారించగా.. వెంకటమ్మ భోజనం చేస్తున్న సమయంలో ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి, భోజన పాత్రను పక్కకు జరిపి, జుట్టు సరిచేసుకుంటున్నట్లు నటిస్తూ అదును చూసి ఆమె వద్ద ఉన్న సుమారు ఒక తులం బంగారు గుండ్లను బలవంతంగా లాక్కొని పరారైనట్లు తెలిసింది.

బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చేవెళ్ల పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి నిందితురాలిని గుర్తించారు. కందవాడ గ్రామానికి చెందిన బైండ్ల బాలమ్మ (53) ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం ఆమెను న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో నిందితురాలికి గతంలో హత్య, దొంగతనం కేసులతోనూ సంబంధం ఉన్నట్లు వెల్లడైందని తెలిపారు. ఈ అంశాలపై మరిన్ని వివరాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని చేవెళ్ల సీఐ నరేందర్ రెడ్డి వెల్లడించారు.

## కోకట్ గురుకులంలో ఘనంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవం



**తాండూరు ఆక్టోబర్ 24(జనంసాక్షి) :** కోకట్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో యుఎన్.ఓ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సరస్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సోషల్ వర్కర్ కేవిఎం వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవిఎం వెంకట్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1945 అక్టోబర్ 24న ఏర్పాటై ప్రపంచ శాంతి, మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోంది. యుద్ధాలు, విద్వేషాలకు దూరంగా మానవత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం ప్రపంచానికి సవాల్ గా మారాయి. విద్యార్థులు మొక్కలు నాటడం, ప్లాస్టిక్ తగ్గించడం వంటి చర్యలతో పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు.దేశాల మధ్య సరిహద్దులు ఉండవచ్చు.. కానీ మానవత్వానికి సరిహద్దులు ఉండకూడదని పేర్కొంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణపై ఎంపీఓ ప్రశంసలు



**ధారూర్,అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ధారూర్ మండల పరిధిలోని నాగసముందర్ గ్రామ పంచాయతీ రికార్డులను ఎంపీఓ శ్రీకాంత్ శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించిన ఆయన,వాటిని సక్రమంగా, క్రమపద్ధతిలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ కుమార్‌ను అభినందించారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ,పద్ధతిగా నిర్వహించడం అభినందనీయమని ఎంపీఓ పేర్కొన్నారు. పంచాయతీ పరిపాలనలో రికార్డుల నిర్వహణ కీలకమని,సంబంధిత వివరాలను స్పష్టంగా నమోదు చేయడంతో పాటు రికార్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ కుమార్ రికార్డుల నిర్వహణపై ఎంపీఓ సంతృప్తి వ్యక్తం చేశారు.

## మోమిన్‌పట్ రైతు వేదికలో ఎల్‌నినో ప్రభావ పరిస్థితులపై సమీక్ష సమావేశం వీక్షించిన రైతులు



**మోమిన్‌పేట అక్టోబర్ 24 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ఎల్‌నినో ప్రభావ పరిస్థితులపై నిర్వహించిన సమీక్ష సమావేశాన్ని మోమిన్‌పేట్ రైతు వేదిక ద్వారా రైతులు వీక్షించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం.ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు, వాటి వల్ల పంటల సాగుపై పడే ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించడంపై దృష్టి సారించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవడం, పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించడం వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని భావిస్తున్నారు.

మోమిన్‌పేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీక్షణ కార్యక్రమంలో రైతులు పాల్గొని సచివాలయం నుంచి ప్రసారమైన సమీక్ష సమావేశాన్ని వీక్షించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన చర్యలు తీసుకోవచ్చని ఈ సందర్భంగా ప్రాధాన్యత సంతరించుకుంది ఈ కార్యక్రమంలో మర్పలి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ యాదవ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కోస్గి సురేందర్, మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు : జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా



**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 24 (జనం సాక్షి):** పోలీస్ ఫ్లాగ్ డే-2026 కార్యక్రమాల్లో భాగంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ రచనా నైపుణ్యాన్ని, ఆలోచనా శక్తిని, సామాజిక అంశాలపై తమకున్న అవగాహనను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, దేశ రక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులకు తెలియజేయడం, ప్రజల భద్రత కోసం పోలీసులు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించడం, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడం లక్ష్యంగా ఈ వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ అమరవీరుల త్యాగాలు, విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు, ప్రజల ప్రాణాలు ఆస్తుల రక్షణలో పోలీస్ శాఖ పాత్ర, శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, ప్రజలకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు వంటి అంశాలపై వ్యాసాలు రాసేలా ప్రోత్సహించారు. సమాజంలో శాంతి, భద్రతలను కాపాడటంలో పోలీసుల బాధ్యతలను విద్యార్థులు అర్థం చేసుకునేలా ఈ కార్యక్రమాలు దోహదపడ్డాయి.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలను విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పోలీస్ శాఖ పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా సామాజిక అంశాలపై కూడా అవగాహన పెంచుకోవాలని, సమాజంలో జరిగే అన్యాయాలు, నేరాలు, అసాంఘిక కార్యకలాపాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ముఖ్యంగా యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, మహిళలు చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజలు, పోలీసుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు బలోపేతం కావడానికి విద్యార్థులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, రచనా నైపుణ్యం, ఆలోచనా సామర్థ్యం పెంపొందించడంతో పాటు పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాల పట్ల గౌరవభావం పెరుగుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మంచి పౌరులుగా ఎదగాలనే స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు.



## పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

**అల్వాల్, అక్టోబరు 24 (జనంసాక్షి):** మచ్చ బొల్లారం డివిజన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టినట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ నర్ల సురేష్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన ఆవశ్యకతపై ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యావంతులు సమాజంలో మార్పునకు కీలకమని, తమ ఓటు హక్కుతో ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొబ్బిలి మధుసూదన్‌రెడ్డి, బసిరుద్దీన్, వంశీ పాల్గొన్నారు.

## ఆంధ్ర హౌస్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్‌పల్లి, అక్టోబర్ 24(జనంసాక్షి):** వివేకానంద నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్ర హౌస్ రెస్టారెంట్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రారంభించారు. నిర్వాహకులు క్రాంతి కుమార్, వారి మిత్రులు ఆయనకు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులను అభినందించిన రాజేశ్వరరావు, వినియోగదారులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆంధ్ర హౌస్ రెస్టారెంట్ ప్రజల ఆదరణ పొందుతూ మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు, వారి మిత్రులు పాల్గొన్నారు.

# కోకాపేట్‌లో జోయాలుక్కాస్ డైమండ్ జ్యువెలరీ షో



**రాజేంద్రనగర్,అక్టోబర్24(జనంసాక్షి) :** జోయాలుక్కాస్ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో కోకాపేట్ షోరూమ్‌లో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రారంభమైంది. అక్టోబర్ 24 నుంచి నవంబర్ 8 వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఇందులో వివాహ వేడుకలకు అనువైన వజ్రాభరణాల సెట్లతో పాటు ఆధునిక డిజైన్లలో రూపొందించిన ఆభరణాలను అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్, ఎండీ డాక్టర్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ.. వజ్రాభరణాల ప్రత్యేకత, నైపుణ్యం, ఆధునిక డిజైన్లను వినియోగదారులకు పరిచయం చేయడమే ఈ ప్రదర్శన లక్ష్యమన్నారు. ప్రదర్శన సమయంలో రూ.లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు ఉచితంగా ఒక బంగారు నాణెం అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది.ఈ కార్యక్రమంలో నార్సింగ్ మాజీ గ్రామ సర్పంచ్ క్యాతం ప్రసన్న అశోక్ యాదవ్, జోయాలుక్కాస్ యాజమాన్య ఉద్యోగస్తులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## కార్మికులందరికి కనీస వేతనం 42 వేలు ఇవ్వాలి



సీఐటీయూ మండల కార్యదర్శి కిష్టప్ప

**శామీర్ పేట, అక్టోబర్ 24(జనం సాక్షి) :** మున్సిపల్లో చేస్తున్న కార్మికులందరికి కనీస వేతనం 42 వేలు ఇచ్చి తీరాలని శామీర్ పేట మండల కార్యదర్శి కిష్టప్ప అన్నారు. అక్టోబర్ 26వ తేదీన ఇందిరాపార్క్ దగ్గర జరగబోయే ధర్నా జయప్రదం చేయాలని శనివారం రోజున అలియాబాద్ మున్సిపల్ ఆఫీసు ముందు వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఏ అశోక్, శామీర్ పేట మండల కార్యదర్శి ఎం కిష్టప్ప, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు,పాల్గొన్నారు.

## మందిపల్ గ్రామంలో డీపీఓ జయసుధ పర్యటన



అక్టోబర్ 24 జనం సాక్షి వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో నూతన పెన్షన్ల వెరిఫికేషన్‌ను జిల్లా డీపీఓ జయసుధ పరిశీలించారు. అనంతరం వివో భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల ఎంపీడీవో ఇన్చార్జి వెంకన్న గౌడ్, ఎంపీఓ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నాగరాజు యాదవ్, గ్రామ కార్యదర్శి శైలజ రెడ్డి, ఏఈ శివకుమార్, ఐసి చంద్రశేఖర్, ఏపిఎం బాలకృష్ణ,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు యాదమ్మ, మహిళా సంఘ సభ్యులు,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు

## యాచారం మండలంలో యథేచ్ఛగా నిషేధిత గుట్కా విక్రయాలు... పట్టించుకోని అధికారులు!

**యాచారం, అక్టోబర్ 24,(జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుట్కా, పాన్ మసాలా మరియు ఇతర నికోటిన్ ఉత్పత్తులపై కఠినమైన నిషేధం విధించింది. అయినప్పటికీ, యాచారం మండలంలో ఈ నిబంధనలు కేవలం కాగితాల కే పరిమితమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలోని కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో గుట్కా ప్యాకెట్లు ఎటువంటి భయం లేకుండా బహిరంగంగా అమ్ముడవుతున్నాయి.

ప్రభుత్వ నిషేధాజ్ఞలను బేఖాతరు చేస్తూ కొందరు వ్యాపారులు అధిక లాభాల ఆశతో గుట్టుచప్పుడు కాకుండా గుట్కాను నిల్వ చేసి, యువతకు, నిరుపేద కూలీలకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు, యువత ఈ వ్యసన బారిన పడి అనారోగ్యాల పాలవుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమంగా గుట్కా నిల్వలను తరలించే వారిపై మరియు విక్రయించే దుకాణదారులపై ఉక్కుపాదం మోపడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కాబట్టి, సంబంధిత ఫుడ్ సేఫ్టీ, రెవెన్యూ మరియు పోలీసు శాఖల అధికారులు తక్షణమే స్పందించి, యాచారంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని... నిషేధిత గుట్కా విక్రయాలకు పాల్పడుతున్న వారి లైసెన్సులు రద్దు చేసి, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ

**షాబాద్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** వృద్ధురాలు ఒంటరిగా ఉన్న సమయాన్ని అదునుగా చేసుకున్న గుర్తుతెలియని మహిళ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పరారైంది. ఈ ఘటన షాబాద్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వీధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జక్కని లక్ష్మమ్మ (70) ఇంటి ఆరుబయట ఉండగా, అటుగా వచ్చిన గుర్తుతెలియని మహిళ ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరారైంది. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితురాలిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



## బస్వాపూర్ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించండి

### చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సర్పంచ్ స్రవంతి శివరాజ్ వినతి

**బంట్వారం, అక్టోబర్ 24 (జనంసాక్షి):** బంట్వారం మండలం బస్వాపూర్ గ్రామ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి సహకరించాలని కోరుతూ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి గ్రామ సర్పంచ్ స్రవంతి శివరాజ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత మురుగు కాలువల నిర్మాణం, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు కేటాయించాలని ఎంపీని కోరినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దసరా పండుగ సందర్భంగా ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామనాయకులు పాల్గొన్నారు.

## మంచినీటి లీకేజీని అరికట్టాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి జిఎంకు సిపిఐ నాయకుల వినతి



**జవహర్‌నగర్ అక్టోబర్ 24 : (జనంసాక్షి) :** భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి లీకేజీలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జీఎం సునీల్ కు సిపిఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. హెచ్. దశరథులు మాట్లాడుతూ... దేశంలో, రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు 'ఎల్ నినో' ప్రభావం వల్ల తీవ్ర నీటి కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటితో పాటు సాగునీటి వనరులను కాపాడాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల జవహర్‌నగర్‌లోని వికలాంగుల కాలనీలో తరచూ మంచినీటి పైపులు లీకేజీ అయి అనేక లీటర్ల నీరు రోడ్లపై వృథాగా ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కాలనీ ప్రజలు తాగునీరు సరిగ్గా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి పరిపరిష్కరించాలని కోరారు. అదేవిధంగా, గిరి ప్రసాద్ నగర్‌లో గతంలో రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీరు.. ప్రస్తుతం వారానికి ఒకసారి మాత్రమే ఇస్తున్నారని, అవి కూడా అరకొరగా రావడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గిరి ప్రసాద్ నగర్ నీటి సమస్యను కూడా యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి. వెంకటాచారి, ఏఐటీయూసీ నాయకులు ఎ. ఎల్లయ్య, రైతు సంఘం నాయకులు పి. నరసింహ, ఆదర్శనగర్ సిపిఐ కార్యదర్శి పి. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భాజపా తోనే దేశ నిర్మాణాత్మక అభివృద్ధి సాధ్యం : బిజెపి నేత కసిరెడ్డి సింధూరెడ్డి



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** దేశంలో, రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ పాలనతోనే దేశ సౌభాగ్యం తోపాటు నిర్మాణాత్మక అభివృద్ధి సాధ్యపడుతుందని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కసిరెడ్డి సింధూరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర బిజెపి ఇంచార్జ్ సునీల్ బన్సల్ కు శంషాబాద్ ఎయిర్పోర్టులో స్వాగతం పలకడానికి శనివారం ఆమె భారీగా నాయకులు కార్యకర్తలతో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశంలో ప్రాపంచిక సమస్యల కన్నా అంతర్గత విభేదాలు, మత హింసలు పెరిగిపోయాయన్నారు. యావత్ ప్రపంచం భారతదేశాన్ని సమగ్రంగా అభివృద్ధి చెందిన అగ్రరాజ్యంగా, భారత ప్రధాని నరేంద్ర మోడీని విశ్వ గురువుగా కొనియాడుతుంటే ఇది మింగుడు పడని కొన్ని కుహనాశక్తులు దేశంలో అంతర్గత అశాంతిని రేకెత్తించి దేశ ప్రతిష్టను దిగజార్చేందుకు కుట్రలు పందుతుండడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో గతంలో రెండు దఫాలు పరిపాలించిన బిఆర్ఎస్ పార్టీ, గత మూడేళ్లుగా పరిపాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని లక్షల కోట్ల రూపాయల అప్పుల్లోకి నెట్టేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాలా తీయడంతో పాటు నీచ రాజకీయాలకు ఒడిగాడుతూ భారతీయ జనతా పార్టీపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తుండడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనంగా అభివర్ణించవచ్చన్నారు. దేశ సార్వభౌమత్వం కోసం, భవిష్యత్ తరాల మనుగడ కోసం దేశంలో మరో అవకాశం లేకుండా భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బిజెపిని ఆదరించడం ద్వారా నిజమైన అభివృద్ధికి పునాదులు వేయాలని, ఆత్మగౌరవంతో కూడిన రాష్ట్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని కసిరెడ్డి సింధూరెడ్డి పిలుపునిచ్చారు. శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు తరలి వెళ్లిన వారిలో యువమోర్చా అధ్యక్షులు కండె గణేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాంభూపాల్ గౌడ్, మల్లారెడ్డి, బిజెపి నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం

**ప్రధానోపాధ్యాయుడు రాములు**

**నాగారం ప్రభుత్వ పాఠశాలలో ఆర్ట్ అండ్ కల్చర్ కార్యక్రమాలు**

**కీసర, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** విద్యార్థుల్లో సృజనాత్మకత, అంతర్గత ప్రతిభ వెలుగులోకి వస్తాయని నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. శనివారం నాగారం డివిజన్ పరిధిలోని నాగారం పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు ఆర్ట్ అండ్ కల్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు, పాటలు, పద్యాలు, కథా పఠనం, స్కిట్లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అరవింద్ కుమార్, శ్రీదేవి, సుమతి, మాలోత్ నాయక్, వందన, వరమ్మ, అజీజ్ అహ్మద్, రఘు, అర్చన, సంజయ్, రాణి, సరిత, గాయత్రి, సుప్రజ, విద్యా వాలంటీర్లు స్వప్న, పావని, పవిత్ర, విశాలి, దివ్య, పద్మ, కార్యాలయ సిబ్బంది సౌజన్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు చేసుకోవాలి



**రాజేంద్రనగర్,అక్టోబర్24(జనంసాక్షి) :** రంగారెడ్డి- హైదరాబాద్- మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ కోరారు. ఓటు నమోదు ప్రక్రియలో సమస్యలు ఎదురైతే 9948312244 నంబర్‌ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

**ఓటరు నమోదుపై దృష్టి సారించాలి.. పార్టీ శ్రేణులకు నాయకుల పిలుపు**



**కీసర, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం ఖాయమని నాగారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామ కూర మల్లారెడ్డి ఆదేశాల మేరకు శనివారం నాగారం డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటరు నమోదు కార్యక్రమంపై చర్చించారు. ప్రతి ఇంట్లోనూ గ్రాడ్యుయేట్లు ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని నాయకులు సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపోటములు ఓటరు నమోదుపై ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత, జెన్-జీ యువతలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై వ్యతిరేకత ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు తగ్గాయని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## మిత్రబంధానికి చిరునామా.. మారుతీ మిత్ర మండలి

**మూడో ఏడాది ఘనంగా అలాయ్ బలాయ్ వేడుకలు**

**కీసర, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** మిత్రులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఆత్మీయతను పంచుతూ స్నేహబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మారుతీ మిత్ర మండలి నిర్వహిస్తున్న అలాయ్ బలాయ్ కార్యక్రమం ప్రత్యేకతను చాటుతోంది. మిత్రుల మధ్య స్నేహం, ఆప్యాయతలను పెంపొందించడమే ధ్యేయంగా, మారుతీ మిత్ర మండలి ఆధ్వర్యంలో నాగారం జీఆర్ఎన్ఎస్ గార్డెన్‌లో మూడో ఏడాది అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా మిత్రులంతా ఒకచోట చేరి సంతోషాలను పంచుకునేలా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న.. మండలి నిర్వాహకులు, స్నేహబంధాల బలోపేతానికి కృషి చేస్తున్నారు. మండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి హనుమంత్, కోశాధికారి మచ్చ బాబు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ చారి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది మరింత మంది మిత్రులను భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు సీతారాం రెడ్డి మాట్లాడుతూ.. అలాయ్ బలాయ్ కార్యక్రమం మిత్రులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే ప్రత్యేకమైన ఆత్మీయ సమ్మేళనమని అన్నారు. రాజకీయాలు, కులమతాలు, హోదాలకు అతీతంగా మిత్రులంతా కలుసుకొని ఆప్యాయతలను పంచుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు రేబెల్లి శ్రీనివాస్ గుప్తా, రామిని తిరుమలేష్ గుప్తా, ఈసీఐఎల్ రిటైర్డ్ ఉద్యోగి పాండు, బీఆర్ఎస్ నాయకుడు ఎనుముల నరసింహారెడ్డి, బీజేపీ నాయకుడు గణేష్ ముదిరాజ్ తదితరులు మాట్లాడుతూ.. మారుతీ మిత్ర మండలి ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మిత్రుల మధ్య అనుబంధాలను పెంచడంతోపాటు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## కోట్‌పల్లిలో ట్రాఫిక్‌పై పోలీసుల అవగాహన

**కోట్‌పల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్ఐ మీనాక్షి ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని ఎస్ఐ కోరారు.

## పెండింగ్ సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి

- ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు.. అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలు అందించడంతోపాటు అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, చీఫ్ ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్, విజిలెన్స్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధిపతులతో శనివారం ఆమె సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ ఫిర్యాదులు, కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పరిపాలనాపరమైన అంశాలపై సమీక్షించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పెండింగ్ ఫిర్యాదు లు, బిల్డ్ నౌ దరఖాస్తులు, భూసేకరణ, వాక్-ఫ్రీ కార్యక్రమం, కోర్టు కేసుల పురోగతిని సమీక్షించారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, కోర్టు కేసుల విషయంలో సంబంధిత అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగంలో మంజూరైన, ప్రతిపాదిత పనులు, పార్కుల అభివృద్ధి, జంక్షన్ల అభివృద్ధి, ఫుట్‌పాత్‌లు, ప్రజా సౌకర్యాలు, వీధి దీపాల ఏర్పాటుపై సమీక్షించారు. పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పట్టణ సమాజ అభివృద్ధి విభాగంలో స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు రుణ అనుసంధానం, పీఎం స్వనిధి పథకం, జీవనోపాధి కార్యక్రమాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్షిస్తూ కార్మికులు, వాహనాల హాజరు, నో బిన్-నో ట్రేడ్ కార్యక్రమం, పోస్టర్ రహిత నగర ప్రచారం, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు నివారణ చర్యలు పటిష్టంగా చేపట్టాలని, ప్రజారోగ్య సమస్యలపై వచ్చే ఫిర్యాదు లకు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. మున్సిపల్ ఆస్తుల నిర్వహణ, పట్టణ జీవవైవిధ్య అభివృద్ధి, వాహనాల కొనుగోలు, నీటిలో కలుపు మొక్కల తొలగింపు, ప్రకటనల నిర్వహణ, ఐటీ సమస్యలు, జనగణన కార్యకలాపాల పురోగతి తీరును కూడా సమీక్షించారు. పెండింగ్ పనులను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కమిషనర్ అధికారులకు స్పష్టం చేశారు. సమర్థవంతమైన పర్యవేక్షణ, జవాబుదారీతనంతో సీఎంసీ పరిధిలో మున్సిపల్ పరిపాలనను మరింత మెరుగుపరచాలని సూచించారు.